కథ

# అవును, మారిపోయాను!

''నువ్వు మారిపోయావు. నువ్వసలు మారిపోయావే... మునుపటి సుశీలవు కావు'' తండ్రీ, భర్తా అన్న ఈ మాటలే సుశీల మస్తిష్కంలో పదే పదే గింగురుమంటున్నాయి.

'అవును మారిపోయాను. ఎందుకు? ఎలా? యిది ఎవరికీ అక్కర్లేదు. తెలుసుకోరు. ఎన్ని అవాంతరాలొచ్చినా, ఎన్ని అవమానాలెదురైనా, వ్యక్తిత్వం చచ్చినా మారకుండా ఎలా ఉంటాను? అందుకే మారాను. మారిపోయాను' విలవిల్లాడింది సుశీల హృదయం.

ఆరోజుల్లో 'అలా' జరిగి ఉండకపోతే ఈరోజు సుశీల యిలా మారేది కాదు.

చిన్నమాటంటే చాలు గుడ్ల నీరు కుక్కుకుని పరిస్థితులకు సర్దుకుపోవడం తప్ప మరో ప్రపంచం ఎరుగని సుశీల కేవలం పన్నెండేళ్ళలో ఇలా యింతలా మారిపోయిందంటే దానిక్కారణం ఎవరు?

సుశీలా అందరిలాగే ఆదర్శగృహిణిగా భర్తనీ పిల్లలనీ చూసుకుంటూ సంసారాన్ని సాగిద్దామనుకుంది. కానీ పరిస్థితులు తారుమారై పెళ్ళయిన ఏడాదికే... తన స్థితి దీనంగా మారడానికి కారణమైన అతడి వల్లనే కదా..యిప్పుడిలా మారింది.

అతడెవరా...? పదండి కథలోకి.

★★★

సుశీల పుస్తకాలు పుచ్చుకుని యింటి దగ్గర తలదించుకుని కాలేజీకి బయల్దేరితే మళ్ళీ అక్కడే తలెత్తేది. అలాగే యింటికీనూ. ఇలా తనకంటూ ఒక ఫ్రెండ్స్ సర్కిల్ లేకుండా ఇంటర్‌లో ఫస్ట్‌క్లాస్ మార్కులతో ప్యాసైంది. మరి చదివించే స్తోమత లేక, తనలాగే ఓ ప్రైవేటు కంపెనీలో టైపిస్ట్‌గా పని చేస్తున్న సుబ్బారావుకిచ్చి ముప్పైవేల కట్నంతో సాగనంపాడు తండ్రి. యింకా, సర్వీసులోగా, యిద్దరు ఆడపిల్లలు పెళ్ళికున్నారన్న ముందు చూపుతో, ముగ్గురాడపిల్లల్లో పెద్దదైన సుశీలకు పదిహేడేళ్ళకే పెళ్ళి చేశాడు, సుశీల తర్వాత ఒక కొడుకు పదో క్లాసు నాలుగుసార్లు తప్పినా ఓపిగ్గా చదివిస్తూ.

సుశీల తల్లి నోట్లో నాలుక లేనిది. అక్షరం ముక్క రానిది. భర్త తెలివితేటలపై విశ్వాసమున్నది. ఏవంటుంది?

అంతే సుశీల ఇల్లాలైంది.

అదుగో అప్పట్నుంచే సుశీల జీవితం వింత తోవలు తొక్కింది. అప్పటివరకూ అమ్మకు పనుల్లో సహకరిస్తూ మధ్య మధ్యలో చదువుకుంటూ నిదానంగా...నడచుకునే సుశీల ఎప్పటికప్పుడు టెన్షన్‌తో పరుగులు పెట్టడం మొదలుపెట్టింది.

పావుగంట ఆలశ్యంగా లేస్తే ఏం ప్రళయం ముంచుకొస్తుందోననే భయం! అత్తమామలకు బ్రష్ చేయడంతోటే కాఫీ, టిఫిన్లు కాస్త ముందూ వెనుకలు అవకూడదు.

''కోడలొచ్చిందిగా పనిమనిషినీ, చాకలినీ మాన్పించాం. ఖర్చు దండగనీ'' పిచ్చాపాటీగా పక్కింటావిడతో అత్తగారి మాటలు. మనసు కలుక్కుమన్నా పోన్లే పెద్దావిడ అంటే అంది అని సరిపెట్టుకుంది. వీధి అరుగుమీద ఎవరితోనో బాతాఖానీ కొట్టే మామగారు అక్కడ్నుంచే 'టీ' అని అరిస్తే కాస్త లేటైతే.

''యిదిగోనండీ... ఇలా చెప్పిన అరగంటకి! మీ కోడల్లా కాదులెండి. ఒట్టి నజ్జు వ్యవహారం'' అని చెప్పేతీరుకి మనసులో బాధపడ్డా పోన్లే పెద్దాయన అంటే తప్పేముంది చాదస్తం అని సర్దుకుంది.

పెళ్లైతే యిలాగే ఉంటుంది. ఇన్నీ బాధ్యతలే యివి లేకుండా ఎలా ఉంటాయి. ఉమ్మడి కుటుంబాల్లోని కోడలికన్నా నా పరిస్థితి నయమే కదా! అని మనసుకు సర్దిచెప్పుకుంది.

రోజూ భర్త ఆలశ్యంగా అర్ధరాత్రి రావడం తినీ తినక ఎడముఖంగా పడుకోడం, యింటెడు చాకిరీనీ అలసటనీ భర్త అనునయింపులో, స్పర్శలో మరచిపోదామనుకునే సుశీలకు భరించరాని కష్టమనిపించినా... పోన్లే పగలు వెళ్ళిపోతాడు ఈ సమయానికి వస్తాడు. ఆఫీసుల్లో పనికి బాగా అలిసిపోయి వుంటాడు అని సర్దుకునేది.

ఇలా ఎప్పటికప్పుడు మనసును సర్దుబాటు చేస్తూ ఒక్క సంవత్సరం గడిపింది.

భర్త ముఖం చూడడం లేదని, గొడ్రాలు అని శాపనార్థాలు పెడ్తోన్న అత్తకు నోరువిప్పి ఎలా చెప్తుంది? తనకి సేవలు చెయ్యడం వండిపెట్టడం తప్ప కనీసం కన్నెత్తి చూడని, ఒక యంత్రంలా భావిస్తూన్న భర్తని తన వైపు తిప్పుకోలేని అశక్తత ఒకవైపు...

అత్తమామలూ... చుట్టుపక్కల వాళ్ళూ గొడ్రాలు అంటూ వేస్తూన్న ముద్ర ఒకవైపూ...

సుశీల నెమ్మదిగా ఆ పరిస్థితులకలవాటుపడి ఒక యంత్రంలాగా పనిచేస్తోన్న తరుణంలో...

మూడు రోజులుగా యింటికి రాకుండా ఏడ్పించిన భర్త అర్ధరాత్రి పన్నెండు గంటలకు తాగొచ్చి తలుపుతట్టాడు. తలుపు తీసేసరికి సుశీల మీద తూలిపడ్డాడు. అతన్ని తట్టుకోలేని సుశీల కూడా నేలమీద పడిపోయింది. మెల్లగా లేచి భర్తను లేపి తీసుకుని వెళ్ళి మంచం మీద పడుకోపెట్టబోతూంటే చొక్కా జేబులోంచి పర్సూ, దానిలోంచీ ఒక ఫోటో బైటపడ్డాయి. అదేంటా అని చూడబోతే ఒక స్త్రీది!

సహనాన్ని చంపుకుని భర్త 'పక్క'ను పంచుకోక పోయినా సహించి ఊడిగం చేస్తూంది. కానీ అతని ప్రవర్తన వెనకాల ఒక స్త్రీ ఉందని తెలిస్తే... ఎలా ఉంటుంది? మనసు మండిపోయింది.

మనీ పర్సులో ఫొటో చోటు చేసుకుందంటే, గుండెలో లోతుగా పాతుకున్నదే అయుంటుందన్న వేదనతో భర్తను కుదిపింది.

''డిస్టర్బ్ చెయ్యకు కమలా. హాయిగా నిద్రపోనీ. ఆ యింట్లో ఎల్లాగా సుఖం లేదు యిక్కడైనా ప్రశాంతంగా ఉండనీ..'' అంటూ భర్త కలవరింత విన్న సుశీలకు ఆ గదంతా గిర్రున తిరుగుతున్నట్లనిపించింది.

వెంటనే వెళ్ళి పెరట్లో మంచం మీద కూచుని కబుర్లాడుకుంటూన్న అత్తమామలకు విషయం చెప్తే..

''తాగి రాడు మరీ వాడికి సుఖం ఏముందీ?'' అంటూ కొడుకునే సమర్థించారు.

కన్నీరు మున్నీరుగా ఏడ్చింది. అతనే సర్వస్వం అనుకుని అతని చిటికెనవేలు పట్టుకుని వచ్చిన తనకున్న చోటు ఏమిటో అర్థంకాక భూమి బద్దలై అందులో కూరుకుపోయినా బాగుండుననిపించింది.

ఇలా పరి పరి విధాలపోయిన మనసును, మళ్ళీ సర్దిచెప్పి అపార్థం చేసుకోవల్సినంత పెద్ద విషయమేమీ కాకపోవచ్చన్న ఆశతో ఆ రాత్రి గడిపి మర్నాడు ప్రొద్దున్నే సెలవు కావడంతో భర్త పేపరు చదువుతుండడం గమనించి రాత్రి విషయం గురించి కదిపింది.

''రాత్రి తాగొచ్చారు'' అంది మెల్లగా.

''అవునే తాగొచ్చాను. అయితే ఏంటిట? తిని పడుండు వివరాలడక్కు'' అని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు.

అయినా వదలక ''మీ మనీ పర్సులో ఫొటో క్రిందపడిపోయింది యిది ఎవరిదండీ'' గట్టిగా అడగాలనుకున్నా నెమ్మదిగా భయంగా అడిగింది-ఫొటో చూపిస్తూ.

అదేం పట్టించుకోక ''నా పర్సు వెతికేవన్న మాట నీకిదేం పాడు బుద్ధి. యిన్నాళ్ళలో ఎంత లాగేవు నాకు తెలీకుండా'' అని అడిగాడు వ్యంగ్యంగా, ఫొటో లాక్కుంటూ.

''ఆ అలవాటు నాకేం లేదు. మీరు తాగొచ్చి తూలిపడితే చొక్కా జేబులోంచీ పర్సూ అందులోంచీ ఫొటో క్రిందపడ్డాయి. ఇంతకీ ఆ అమ్మాయెవరు 'కమల' అని కలవరించారు కూడా'' తెలుసు అన్నట్లు అడిగేసరికి..

''ఊ... తెలుసుకున్నావుకదా. యింకా విను అది నా పాత సెటప్పు. ఇంకా చెప్పాలంటే నీకన్నా ముందుంది. దాన్నే చేసుకుందామంటే నీ మావ అదే మా నాన్న నువ్వు తెచ్చే ముష్టి ముప్పై వేల కోసం ఆశపడ్డే నీకు తాళికట్టేను. ఫలితం ముద్ద పడేస్తున్నాను. సంవత్సరానికి ఒకాడో రెండో చీరలు కొంటున్నాను. ఇంకేం కావాలి నీకు? తిని పడుండు'' అన్నాడు గట్టిగా అరుస్తూ.


''అంతేనా భార్యగా యింకేదీ లేదా మీకు బాధ్యత? ఎంత ధైర్యంగా చెప్తున్నారు? నాకే దిక్కులేదు యింకో సెటప్పొకటి'' ఉక్రోషంగా అంది సుశీల.

''ఏంటే రెచ్చిపోతున్నావు? అది నీలా మొద్దేం కాదు. బాగా చదువుకుంది. గవర్నమెంటుద్యోగం చేస్తోంది. అది నా బంగారు బాతు గుడ్డు. మన కులంకాదని ఈ ముసలాళ్ళు ఏడిస్తే నిన్ను కట్టుకున్నాను తెలుసా. యింకేం అరవకు చచ్చినట్టు పడుండు'' అని విసురుగా బయటకు వెళ్ళిపోయాడు.

ఎంత తేలిగ్గా చెప్పాడు. చేస్తోన్న తప్పును ఎంత నైపుణ్యంగా సర్దుకున్నాడు. అంటే తనకంటూ ఒక స్థానం ఉనికీ లేని యింటికోసం తనిన్నాళ్ళూ తపనపడ్తోంది. తనకంటూ విలువీయని మనుషుల కోసం ఊడిగం చేస్తోంది.

పదే పదే భర్త మాటలు చెవుల్లో గింగురుమంటూంటే భరించలేక ఓ రోజు మామగారు రోజూ రాత్రి వేసుకునే నిద్రమాత్రలను ఎక్కువ మోతాదులో మింగేసింది. దాంతో యింటిల్లిపాదీ బెంబేలెత్తి ఆస్పత్రిలో చేర్పిస్తే ఎలాగో బ్రతికి బైటపడింది.

ఎలాగో బ్రతికి బైటపడ్డ తనని తీసుకువెళ్ళమని తన తండ్రికి చెప్తోన్న



భర్తను పిలిచి ''నేను అక్కడికి వెళ్ళను'' అని చెప్పింది.

''నా యింట్లో నువ్వుండొద్దు యిప్పుడు నా అదృష్టం కొద్దీ బ్రతికేవు. సరిపోయింది. అదే రేపు నువ్వింకేదో చేసి చస్తే నన్ను జైల్లో తోస్తారు. నాకెందుకీ రొంపి'' అని ఛీదరించుకున్నాడు భర్త.

''ఇదంతా నా ఖర్మబాబూ అందరూ వద్దు అంటున్నా చదివించాను-కాలేజీ చదువు. ఏదో గుట్టుగా సంసారం చేస్కుంటుందని ముడేసి పడేస్తే ఏం రోగమొచ్చిందో యింతకు తెగించింది. నేను మాత్రం దీన్ని తీసుకెళ్ళి నలుగురికీ ఏం చెప్పుకోను? ఎలా పరువుగా బ్రతకను నా ఖర్మ నా ఖర్మ'' అని తండ్రి తలబాదుకోవడం చూసి...

డిశ్చార్జ్ చేసే నాడు ఎవ్వరికీ చెప్పకుండా... ఎవ్వరూ రాక ముందే, బైటకు వచ్చేసింది సుశీల. ఖర్మ అనుకునే తండ్రి యింటికీ, రొంపి అనుకునే భర్త యింటికీ వెళ్ళడం యిష్టం లేక మెళ్ళో ఉన్న రెండు తులాల మంగళ సూత్రాలకున్న గొలుసును అమ్మి వచ్చిన డబ్బుతో వర్కింగ్ వుమెన్ హాస్టల్‌లో చేరి, ఉద్యోగాల వేట మొదలుపెట్టింది. ఏదీ దొరక్క హాస్టల్‌లోనే కుక్‌కి అసిస్టెంటుగా చేరి తీరిక సమయాల్లో డిగ్రీ చేసింది. ఆపైన పి.జి.కూడా చేసింది. కష్టార్జితంతో బ్యాంక్ టెస్ట్‌లు రాసింది. నాలుగేళ్ళు టెస్ట్‌లు రాసిన అనుభవంతో ఐదో ఏడు టెస్ట్‌లో నెగ్గి ప్రొబేషనరీ ఆఫీసరుగా బ్యాంక్ ఉద్యోగం సంపాదించింది. ఉద్యోగమొచ్చిన నాలుగేళ్ళలోనే స్వంత యిల్లు అమర్చుకోగలిగింది. అన్ని సదుపాయాలూ ఉన్న యింట్లో ఐదంకెల జీతంతో హాయిగా ఉంటోంది.

ఇప్పుడు సుశీలకు ఇరవై ఎనిమిదేళ్ళు!

''మీరు చాలా అందంగా ఉంటారు'' అన్న మాటెవరైనా అంటే సిగ్గుపడకుండా ''ఆ విషయం నాకు తెలుసు'' అంటుంది. ''నాకు నీతో గడపాలనుంది'' అనేవడన్నా పై అధికారి అంటే ''నీ భార్యకో కంపెనీని వెతికిచ్చి అప్పుడు రా గడుపుదాం'' అంటుంది.

ఇలా..మగవాళ్ళ నుంచీ తనను తాను కాపాడుకుంటూ 'పొగరున్న ఆడదాని'లా అందరికీ దూరంగా ఉండగల్గుతోంది.

ఓ రోజు తండ్రి వచ్చాడు.

**మేడేపల్లి రంగవల్లి**

''మంచి పని చేశావమ్మా వాడిని వదిలిపెట్టి. నీకేం దర్జాగా ఉన్నావు'' అంటూ అల్లుడ్ని పట్టుకుని తిట్టడం మొదలుపెట్టాడు.

''అతన్నెందుకు తిడ్తావు? నేనీ పొజిషన్‌లో ఉండడానికి నాకో దారి చూపాడు. ఇంతకీ నీకేం కావాలి'' అని అడిగింది.

అతడు తెల్లబోయి ''తమ్ముడికి ఓ ప్రైవేటు ఉద్యోగానికి ఇంటర్వ్యూ వచ్చింది. ఖరారైంది. కానీ ఏభై వేలు అడుగుతున్నారు. అప్పుగానైనా యిస్తే తర్వాత తీర్చేసుకుంటాడు'' అసలు విషయం నీళ్ళు నములుతూ చెప్పాడు.

''ఎంత స్వార్థం నాన్నా తర్వాత తీరుస్తాడో తీర్చడోగానీ యిప్పుడు మాత్రం అప్పుగానైనా అని అడుగుతున్నావు. ఎప్పుడైనాగానీ దీని జీవితం బాగుపడ్తుందేమో అని అప్పుడు నన్ను నీతో తీసుకుని వెళ్ళలేని నువ్వు యిప్పుడో మంచి ఉద్యోగం నాకుందని తెలుసుకుని ఏ ముఖం పెట్టుకుని అడుగుతున్నావు? రానే వచ్చావు, ఈ పూట భోజనం చేసి వెళ్ళు. కూతురింటికెళ్ళి అభోజనంగా పంపిందన్న మాట నాకెందుకు'' అంది ఖచ్చితంగా.

''నువ్వు బాగా మారిపోయావే, కన్నూ మిన్నూ కానక తండ్రినే యింత మాటంటావా'' అంటూ వెళ్ళిపోయి, మర్నాడు తల్లిని పంపించాడు ఆశ చావక.

''నాన్న చేసిందానికల్లా తలూపి, ఆడకూతురు ఎక్కడుందో ఏమైందో అని కనీసం ఆరా తీయలేకపోయావు. నువ్వు తల్లివైనా అమ్మా అన్ని కష్టాల్లో ఉన్న నన్ను ఒక్కసారి ఆదరించలేకపోయావు. ఇప్పుడు సంపాదిస్తున్నానని వెతుక్కుంటూ వచ్చావా అమ్మా'' అంటూ అడగడంతో మారు మాట్లాడక వెళ్ళిపోయింది సుశీల తల్లి.

ఓరోజు మాసిన గెడ్డం, నలిగిన బట్టల్తో కాలింగ్ బెల్ నొక్కిన వ్యక్తిని తలుపు తెరిచి తేరిపార చూసి గుర్తించి

''ఎందుకొచ్చావు'' అని అడిగింది.

''నేను సుబ్బారావుని'' అన్నాడు.

''తెలుస్తూంది విషయమేంటి'' అంది ముఖం చిట్లించి.

''నీతో మాట్లాడాలి'' అన్నాడు తలదించుకుని.

''ఏదన్నా కొత్త పథకమా'' అంది.

''పథకమేంటీ?'' అన్నాడు అయోమయంగా.

''అవును మరి. నీవు పడేస్తే తిని పడుండి నీ పనులకు అడ్డురాకుండా, నిన్నేమీ అడక్కుండా ఉండాల్సిన నాతో నీకు మాటలేంటా అనీ'' అంది వ్యంగ్యంగా.

''అది కాదు లోపలికి పద కూర్చుని మాట్లాడుకుందాం'' అంటూ లోపలికి రాబోయాడు సుబ్బారావు.

గుమ్మానికి అడ్డంగా నిలబడి..''కూర్చుని మాట్లాడే టైంగానీ అవసరంగానీ నాకు లేవు. నీవు వెళ్ళొచ్చు'' అని నిష్కర్షగా చెప్పింది.

''సుశీ నన్ను క్షమించు. చాలా కష్టాల్లో వున్నాను. దాన్ని నమ్ముకుని ఉద్యోగం వదిలేసి బిజినెస్ పెట్టాను. ఆ బిజినెస్ దెబ్బతింది. అప్పులపాలయ్యాను. అదేమో యింకెవడ్నో వల్లో వేసుకుని పారిపోయింది. నీ విలువ తెలిసొచ్చింది. నన్ను క్షమించు నీతో ఉండనివ్వు'' అంటూ భుజం పట్టుకోబోయాడు. ''ఛీ'' అని విదిలించి కొట్టి,

''ఆహా అలాగా బంగారు బాతు కాస్తా ఎగిరిపోయిందన్నమాట. అపుడక్కర్లేని నేను యిప్పుడు బంగారు బాతులా కన్పించి కావాలొచ్చానన్నమాట. ఇన్నాళ్ళకి మన బంధుత్వం కళ్ళు తెరిచిందా? వెళ్ళు వెళ్ళు కథలు చెప్పక వచ్చిన దారినే వెళ్ళు'' అంటూ యింటికి తాళం పెట్టింది బ్యాంక్‌కని బయల్దేర్తూ.

''ఓ మగతోడు లేకుండా జీవితాంతం ఎలా ఉంటావు? భర్తలేని ఆడదాన్ని జనం బ్రతకనివ్వరు తెలుసా'' ఉక్రోషంగా అన్నాడు.

''ఈ పదేళ్ళూ నీకు దూరంగా ఉండీ హాయిగానే బ్రతికాను. ఈ పదేళ్ళూ చాలు నేనెలా బ్రతికానో చెప్పడానికి. ఆ పదేళ్ళూ గడిపిన అనుభవంతో యింకో పదేళ్ళు గడిపేస్తే అడదాన్ని అని కూడా మర్చిపోతారు ఈ జనం. నీ సలహాలూ నీ సహాయాలూ నాకేం వద్దు వెళ్ళు'' అని దండం పెట్టింది.

''నువ్వు మారిపోయావే ఆడదానివి అంత పొగరు పనికిరాదు'' అని తిట్టుకుంటూ వెళ్ళాడు సుబ్బారావు.

★★★

ఇదండీ జరిగిన కథ.

అవును! సుశీల మారిపోయింది. సుశీలే కాదు, ఆ తరహాలో బ్రతుకుతున్న స్త్రీలందరూ మారాలి. మారుతారు కూడా. ఎన్నాళ్ళని కష్టాలకు తలొగ్గుతారు?

సుశీల క్షమించమని వచ్చిన భర్తని రానిస్తే 90 శాతం జనం చేత మంచిది అన్పించుకుంటుంది. ఒకవేళ ఆదరిస్తే... కొన్నాళ్ళు పోయాకా సుబ్బారావు మారడని గ్యారంటీ ఏమిటి? సుశీల మంచిది అన్న ఆ తొంభై శాతం మందిలో ఎవరన్నా ముందుకొచ్చి సుబ్బారావుకి మంచి చెప్తారా? నచ్చచెప్తారా? ఊహూ చెప్పరు. అప్పుడు ''భార్యా భర్తల గొడవల్లో మనమెందుకు దూరడం'' అని తప్పుకుంటారు అవునా!

మరి మిగిలిన పది శాతంలో ఐదు శాతం మంది మళ్ళీ పెళ్ళి చేసుకోమని అన్నా మిగిలిన ఐదు శాతంలో కొందరైనా..ఆమె ఒంటరిగా జీవితం గడిపేందుకే యిష్టపడిందంటే నమ్ముతారా లేక 'మంచి ఉద్యోగం చేస్తోందని పొగరు' అని తిట్టుకుంటారా?

'మార్పు' అందరి జీవితాల్లోనూ అప్పుడో..ఎప్పుడో రానే వస్తుంది. కానీ అది సహజమైనదో..అసహజమైనదో పరిస్థితులే నిర్ణయిస్తాయి. ఆ నిర్ణయానికి అందరమూ బద్ధులమే!

